
ప్రజా విశ్వంభర V3 NEWS

నిర్మాతలను డిమాండ్ చేస్తున్న నిధి.. ఆగిపోయిన తంత్ర-2 షూటింగ్!

యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ మరోసారి వార్తల్లో నిలిచింది. 2024లో విడుదలైన హారర్ థ్రిల్లర్ 'తంత్ర'కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'తంత్ర 2' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై సునీత్ పడోల్కర్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా కొన్ని నెలల క్రితమే పూజా కార్యక్రమాలతో ప్రారంభమై, అనంతరం రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. అయితే తాజా సమాచారం ప్రకారం, నిధి అగర్వాల్ షూటింగ్‌కు సంబంధించి పలు డిమాండ్లు చేస్తున్నారని, కొన్ని షెడ్యూల్స్‌ను రద్దు చేసుకోవడంతో చిత్రీకరణ ప్రణాళికలు దెబ్బతిన్నాయని సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. ఆమె వ్యవహారశైలిపై చిత్రబృందం అసంతృప్తిగా ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం 'తంత్ర 2' షూటింగ్ నిలిచిపోయిందని, ఈ ప్రాజెక్టులో నిధి కొనసాగుతారా? లేదా నిర్మాతలు మరో హీరోయిన్‌ను ఎంపిక చేస్తారా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై నిధి అగర్వాల్ నుంచి కానీ, చిత్ర నిర్మాతల నుంచి కానీ ఇప్పటివరకు అధికారిక వివరణ వెలువడలేదు. మొత్తానికి 'తంత్ర 2' చుట్టూ నెలకొన్న ఈ వివాదం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



నా విగ్రహం పెట్టిన వారానికే ఘోర ప్రమాదం.. ఆ భయానక క్షణాన్ని గుర్తు చేసుకున్న కాజల్



రెండు దశాబ్దాలుగా సినీ ప్రేక్షకులను అలరిస్తున్న నటి కాజల్ అగర్వాల్. అగ్ర కథానాయకుల సరసన ఉన్న ఛాయిస్‌లలో ఆమె మొదటి వరుసలో ఉంటారు. తాజాగా వచ్చిన 'రామాయణ'లో మండోదరిగా నటించి మెప్పించారు కాజల్. 'భారతీయుడు2' షూటింగ్ సందర్భంగా జరిగిన ఘోర ప్రమాదం నుంచి తాను ఎలా బయటపడ్డారో తాజా ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అదొక పీడకలని, దేవుడి దయ వల్లే ఎలాంటి గాయాలు లేకుండా బయటపడినట్లు అభిప్రాయపడ్డారు."సరిగ్గా వారం రోజుల ముందే సింగపూర్ మేడమ్ టుస్సాడ్స్‌లో నా మైనపు విగ్రహం ఆవిష్కరణ జరిగింది. ఆ తర్వాత నేను చెన్నైలో జరుగుతున్న 'భారతీయుడు2' షూటింగ్ కోసం వచ్చేశా. స్వాతంత్ర్యానికి పూర్వం నేపథ్యంలో సాగే యాక్షన్ సన్నివేశాలను రాత్రిపూట తీస్తున్నారు. నేను 80ఏళ్ల మహిళగా ప్రొస్థటిక్ మేకప్‌లో ఉన్నా. మా సీన్స్ లేనప్పుడు సాధారణంగా మేమంతా మానిటర్‌కు దగ్గరగా కూర్చొని చూస్తుంటాం. అయితే ఆ రోజు అక్కడ కూర్చోలేదు. అలా నడుచుకుంటూ ముందుకు వెళ్తుంటే, ఉన్నట్టుండి 100 అడుగుల భారీ క్రేన్ నా కళ్ల ముందే కూలిపోయింది. నా మీద కూడా క్రేన్ పడిపోయిందేమో అనుకున్నా. ఎవరో నన్ను చేయిపట్టుకుని వెనక్కి లాగారని అనిపించింది. కళ్ల ముందే ప్రమాదం జరగడంతో నేను భయంతో వణికిపోతూ కదలకుండా ఉండిపోయాను. ఒక్కసారి తేరుకుని, అందరితో కలిసి నేను పరిగెత్తడం మొదలు పెట్టా. అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది. ఆ సంఘటన తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు గగురుపొడుస్తుంది. భగవంతుడి దయ వల్లే ఒక్క గాయం కూడా కాకుండా ప్రాణాలతో బయటపడ్డారు. అప్పటి నుంచి కృష్ణుడి భక్తురాలిగా మారిపోయా" అని కాజల్ చెప్పుకొచ్చారు.2020లో 'ఇండియన్2' షూటింగ్ సందర్భంగా క్రేన్ కూలిపోవడంతో ముగ్గురు మృతి చెందారు. ఆ ప్రమాదం నుంచి తాను బయటపడటం మిరాకిల్ అంటూ అప్పట్లోనూ కాజల్ పోస్ట్ పెట్టారు. కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో 2024లో విడుదలైన 'భారతీయుడు2' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అత్యంత భారీ బడ్జెట్‌తో తీసిన ఈ మూవీ కేవలం రూ.148 కోట్లు (గ్రాస్) మాత్రమే వసూలు చేసింది. మరోవైపు 'ఇండియన్3'కి సంబంధించిన షూటింగ్ కూడా చాలా వరకూ పూర్తయింది. ఇటీవల ఈ మూవీకి సంబంధించి అప్‌డేట్‌ను చిత్ర బృందం ఇచ్చింది. త్వరలోనే మిగిలిన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు ప్రకటించింది.

కొత్త ప్రయత్నాన్ని ప్రోత్సహించండి



"ఒక మంచి ఆలోచనతో.. వినూత్నంగా తెరకెక్కించే చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. మా 'చంద్రయాన్' అలాంటి అరుదైన చిత్రమే" అన్నారు దర్శక నిర్మాత వేణు ఊడుగుల. ఇప్పుడాయన సమర్పణలో వస్తున్న ఈ కొత్త చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న, ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్ ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. ప్రవీణ్ మొలక నిర్మించారు. ఈ సినిమా ఈ రోజు థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. హీరో శ్రీవిష్ణు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ.. "ఏదైనా కొత్తదనం ఉంటే తప్ప వేణు ఓ సినిమాని ప్రెజెంట్ చేయరు. ఈ చిత్రంలోనూ ఓ సరదా అంశం ఉంది. అది అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు. "ఆయుధాలు, రక్తపాతాలు లేని చిత్రమిది. 2గంటల 15నిమిషాల పాటు ప్రేక్షకుల్ని ఆగకుండా నవ్విస్తుంది" అన్నారు దర్శకుడు శ్రీనాథ్ చంద్రశేఖర్. వేణు ఊడుగుల మాట్లాడుతూ.. "ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తూ.. వినోదాన్ని అందించే చిత్రమిది. ఇలాంటి కొత్త ప్రయత్నాల్ని అందరూ ప్రోత్సహించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో బెక్కెం వేణుగోపాల్,

మానవ ప్రవర్తనలోని విభిన్న కోణాలతో.. 'ఆల్కహాల్'



అల్లరి నరేశ్ కథానాయకుడిగా మెహర్ తేజ్ తెరకెక్కించిన చిత్రం 'ఆల్కహాల్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. రుహానీ శర్మ కథానాయిక. నిహారిక ఎన్.ఎం, సత్య, గిరీశ్ కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని డిసెంబరు 18న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు."మానవ ప్రవర్తనలోని విభిన్న కోణాలు, నేర ప్రవృత్తి లాంటి అంశాల్ని స్పృశిస్తూ ఓ ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రూపొందింది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

మనదైన కథతో.. 'ఇడుపు కాయితం'



మనందరి ఇళ్లల్లో జరిగే సంఘటనలకు అద్దం పట్టే కథతోనే 'ఇడుపు కాయితం' సినిమా తెరకెక్కిందన్నారు ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. నాగదుర్గ కథానాయిక. తబిత సుకుమార్, బన్నీ వాస్ నిర్మాతలు. ఈ చిత్రం డిసెంబరు 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. శ్రీలత, శ్రీను పెళ్లి కథతో ఈ చిత్రం రూపొందినట్టు టీజర్ చాటుతోంది.వేడుకని ఉద్దేశించి దర్శకుడు మాట్లాడుతూ "ఇడుపు కాయితంఅనేది ఓజంట విడిపోవడానికి రాసుకునే పత్రం అనుకుంటాం కానీ, ఆ జంట కొత్త జీవితం ప్రారంభించడానికి అదొక సర్టిఫికెట్‌లా భావించాలన్నదే నా ఉద్దేశం. అందరూ ఈ పేరుని అదే తరహాలో పరిగణించాలి"అన్నారు. నిర్మాత తబితసుకుమార్ మాట్లాడుతూ "అందమైన సినిమా ఇది. నేను ఇక్కడే పుట్టి పెరిగాను. పెళ్లి సంప్రదాయాలు, పెద్దవాళ్లు మాట్లాడుకునే మాటలు ఎలా ఉంటాయో చిన్నప్పుడుచూశా. వాటన్నిటినీ ఈసినిమాతో మరోసారి చూడబోతున్నాం" అన్నారు.నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ "నన్నెందుకు పట్టించుకోవడం లేదని భార్య అడిగే ప్రశ్నకు ఏ భర్త దగ్గర సమాధానం ఉండదు. ఈ సినిమాలో ఆ ప్రశ్నకు ఓ అందమైన సమాధానం ఉంది. చాలా మంచి సినిమా ఇది. మన జీవితాల్లో జరిగే చిన్నచిన్న విషయాల్నిచూపిస్తూ, అక్కడక్కడా నవ్విస్తూ ఆలోచింపజేసేలా దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించారు" అన్నారు. ప్రియదర్శి మాట్లాడుతూ "ఇది మన కథ. ఈ సినిమా చేయాల్సిందే అని మా అందరికీ ధైర్యం చెప్పి ముందుకొచ్చిన తబిత సుకుమార్‌కు కృతజ్ఞతలు.ఇదొక గొప్ప సినిమా అవుతుంది. నాగదుర్గ డ్యాన్సర్‌గానే కాదు, మంచి నటిగా ఈ సినిమాతో మరింత పేరు సంపాదిస్తార"న్నారు. ఈ కార్యక్రమంలో నటులు చంద్రవ్వ, వినోద్ బాల, మైమ్ మధు, విజయ, విద్యాసాగర్, నృత్య దర్శకురాలు శ్రష్టి వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగో వన్డే.. సిరీస్ విజయంపై భారత్ కన్ను

విశ్వంభర, స్పోర్ట్స్: వర్ష ప్రభావిత వన్డే సిరీస్‌లో కీలక సమరానికి వేళైంది. నేడే నాలుగో వన్డే. టీమ్‌ఇండియా సిరీస్‌పై కన్నేయగా.. సిరీస్ గెలిచే అవకాశం లేని న్యూజిలాండ్, కనీసం దాన్ని కాపాడుకోవాలనుకుంటోంది. టెస్టు సిరీస్‌కు సన్నద్ధం కావడం కోసం కీలక ఆటగాళ్లను, సగం కోచింగ్ బృందాన్ని పంపేసిన రెండు జట్లు కొంచెం కొత్తగా కనిపిస్తున్నాయి. భారత్‌కు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించనున్నాడు.

అయిదు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగే నాలుగో మ్యాచ్‌లో టీమ్‌ఇండియా.. ఆతిథ్య న్యూజిలాండ్‌తో తలపడనుంది. తొలి రెండు వన్డేల్లో నెగ్గిన భారత్.. సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. రెండు జట్లు చాలా మార్పులతో ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండడం శుభసూచకం. గత మ్యాచ్‌ల్లోలా వర్షం ఈ మ్యాచ్‌కు ఆటంకాలు కలిగించే అవకాశం లేదు. పిచ్ కూడా బ్యాటర్లకు సహకరించనుంది. సీమర్లకు బాగా మద్దతు లభించిన పిచ్‌లపై తొలి రెండు వన్డేల్లో బ్యాటర్లు చాలా ఇబ్బందిపడ్డ సంగతి తెలిసిందే.

వన్డే సిరీస్‌లో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. భారత జట్టు తొలి రెండు వన్డేల్లో గెలిచి సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే. మరో మ్యాచ్ గెలిస్తే సిరీస్ దక్కుతుంది. మూడో వన్డేలోనే సిరీస్ సొంతం చేసుకోవాలని భావించింది. కానీ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే ఆ మ్యాచ్ రద్దైన విషయం తెలిసిందే. నాలుగో వన్డేలోనైనా సిరీస్ ముగించాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మ్యాచ్ కోల్పోతే ఆఖరిదైన ఐదో వన్డేలో సిరీస్ విజయం కోసం ప్లేయర్లపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. కాబట్టి నాలుగో వన్డేలోనే సిరీస్ కైవసం చేసుకోవాలని ఆశిస్తోంది. మరోవైపు సిరీస్ కాపాడుకోవాలని కివీస్ ఆరాటపడుతోంది.

భారత జట్టులో మార్పులు..

కివీస్‌తో మొదటి మూడు వన్డేలకు, ఆఖరి రెండు మ్యాచ్‌లకు సెలెక్టర్లు వేర్వేరు జట్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగో వన్డేలో బరిలోకి దిగే భారత జట్టులో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆఖరి రెండు వన్డేలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిచ్చారు. దీంతో టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జట్టును నడిపించనున్నాడు. వన్డేల్లో సారథిగా వ్యవహరించడం ఇదే తొలిసారి. అలాగే, గిల్ గైర్హాజరులో ఓపెనర్ స్థానాన్ని ఇషాన్ కిషన్ భర్తీ చేయనున్నాడు. కేఎల్ రాహుల్ స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ తుది జట్టులోకి రానున్నాడు. రోహిత్, కోహ్లీ, నమన్ ధిర్, అక్షర్ పటేల్‌లకు తుది జట్టులో ఖరారే. గత మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమైన స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్ నాలుగో వన్డేలో బరిలోకి దిగనున్నాడు. ఒకవేళ స్పెషలిస్ట్ స్పిన్నర్ కావాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌కు చాన్స్ దక్కనుంది. అదే జరిగితే సిరాజ్‌కు నిరాశే కలుగుతుంది. అర్ష్‌దీప్, అకీబ్ నబీ, గుర్నూర్ బ్రార్ ఈ సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. తొలి రెండు వన్డేల్లో కివీస్‌ను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసింది ఈ త్రయం. కాబట్టి వారిని విడగొట్టే ప్రయత్నం టీమ్ మేనేజ్‌మెంట్ చేయకపోవచ్చు.

వర్షం లేదు..

తొలి రెండు వన్డేలకు అంతరాయం కలిగించిన వర్షం మూడో వన్డేను మాత్రం పూర్తిగా తుడిచేసింది. ఒక్క బంతి కూడా పడుకుండానే ఆ మ్యాచ్ రద్దైంది. అయితే, నాలుగో వన్డేకు వరుణుడి ముప్పు లేనట్టు నివేదికలు తెలిపాయి. వర్షం ఉన్నా మ్యాచ్‌ను ప్రభావితం చేసే స్థాయిలో కురవదని పేర్కొన్నాయి. దీంతో నాలుగో వన్డే సాఫీగా సాగే అవకాశాలు ఉన్నాయి.



తుది జట్లు(అంచనా)

భారత్ : రోహిత్, ఇషాన్ కిషన్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, నమన్ ధిర్, అక్షర్ పటేల్, అకీబ్ నబీ, మహ్మద్ సిరాజ్/కుల్దీప్ యాదవ్, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్

న్యూజిలాండ్ : ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, విల్ యంగ్, నిక్ కెల్లీ, మిచ్ హే, బ్రేస్‌వెల్, సాంట్నర్(కెప్టెన్), డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, జేమీసన్, ఫిషెర్/క్రిస్టియన్ క్లార్క్/హెన్రీ, జాకబ్ డఫీ

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com